కట్టడి చేసేదెలా!

- భయపెడుతున్న వీధి కుక్కలు
- కానరాని నియంత్రణ చర్యలు
- విచ్చలవిడిగా పెరిగిపోతున్న సంతతి
- జనాలపై దాడులు
- నర్సరీలకూ నష్టం



నర్సరీలో గుంపుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

కడియం: గ్రామాల్లో కుక్కల బెడద విపరీతంగా పెరిగింది. పగలు రాత్రి అనే తేడా లేకుండా ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వీటి నియంత్రణ చర్యలు తీసుకోకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. నియోజకవర్గంలోని రూరల్, కడియం మండలాల పరిధిలో ప్రతి గ్రామంలో 500 నుంచి 1000 వరకు వీధి కుక్కలు సంచరిస్తున్నాయని అంచనా. వీటి సంతతిని నియంత్రించే చర్యలు గురించి ప్రభుత్వం యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోకపోవడంతో విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి. కుక్కల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క కడియం మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోనే రోజుకు పది నుంచి 25 మంది వరకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ)లను తీసుకుంటున్నారంటే వీధి కుక్కల విజృంభణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రజలపై దాడి

గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు పాదచారులు, ద్విచక్ర వాహన దారులపై దాడులకు దిగుతున్న ఘటనలు కూడా ఉంటున్నాయి. ముఖ్యంగా ఉదయం, రాత్రి వేళల్లో ప్రయాణించేవారు వీటి కాట్లకు గురవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు వీధుల్లో సంచరించేందుకు జంకుతున్నారంటే వీధి కుక్కల దాడులు ఏ స్థాయిలో భయపెడుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

నిబంధనలు

వీధి కుక్కల నియంత్రణకు పలు నిబంధనలు ఉన్నాయి. ముఖ్యంగా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించి, వీటి సంతతిని నియంత్రించాల్సి ఉంది. కానీ అందుకు అయ్యే వ్యయం ఎక్కువగా ఉండడం, సిబ్బంది కొరత తదితర కారణాలతో గ్రామ పంచాయతీలు వీటిని గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కుక్కల చంపకూడదన్న నిబంధనను చూపించి మాత్రమే సిబ్బంది కాలం గడిపేస్తున్నారంటున్నారు. చంపొద్దని స్పష్టమైన ఆదేశాలైతే ఉన్నాయి, అలాగే సంతతి నియంత్రించే చర్యలు కూడా తీసుకోవాలని కూడా నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పంటలకూ ముప్పే

విపరీతంగా పెరిగిపోతున్న వీధి కుక్కలు ఆహారాన్వేషణలో ప్రజలతో పాటు, పంటలకు కూడా ముప్పుగా మారుతున్నాయని రైతులు అంటున్నారు. డంపింగ్‌యార్డుల్లోకి చేరుతున్న మాంసాహార వ్యర్థాలను తినేందుకు ప్రతి గ్రామ శివార్లలోని డంపింగ్ యార్డుల వద్దకు వందల సంఖ్యలో కుక్కల గుంపులు చేరుతున్నాయి. అక్కడ ఆహారం లభ్యం కాకపోతే పంట పొలాల్లోకి చేరుతున్నాయని వివరిస్తున్నారు. ఎలుకలు, ఇతర జీవులను వేటాందుకు ఇవి పొలాలను కూడా నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

అనేక సమస్యలు

కడియం మండలంలో విస్తరించి ఉన్న నర్సరీల్లో కుక్కల కారణంగా సమస్యలు పెరుగుతున్నాయంటున్నారు. ప్యాకెట్లు, కుండీల్లోని మొక్కలను సైతం ఇవి పడేస్తుండడంతో ఆ మేరకు నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. జనావాసాలకు దగ్గరగా ఉండే పంట పొలాలు, నర్సరీలే కాకుండా ఊరికి దూరంగా ఉండే వ్యవసాయ క్షేత్రాల్లో కూడా కుక్కల బెడద పెరిగిపోయిందంటున్నారు. కొందరు రైతులు కుక్కలు తమ పొలాల్లోకి రాకుండా రంగు నీరు పోసిన సీసాలను కూడా వేలాడదీస్తున్నారు.

నర్సరీలు ధ్వంసం

విపరీతంగా పెరిగిపోయిన కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఒకేసారి 20 నుంచి 30 కుక్కలు నర్సరీల్లోకి వచ్చేస్తున్నాయి. లోపలకు వచ్చాక వీటి సంచారం వల్ల మొక్కలను విరిగిపోవడంతో పాటు ప్యాకెట్లు, కుండీలు పగిలిపోతున్నాయి. వీటిని ఏ విధంగా ఆపాలో అర్థం కావడంలేదు. రంగునీళ్ల బాటిళ్లు కడితే ఆగుతాయని ఎవరో చెబితే తెచ్చికట్టాను. కానీ వీటి ధాటి తగ్గడం లేదు.

– వి.కోటేశ్వరరావు, వీరవరం

తక్షణం చర్యలు తీసుకోవాలి

కుక్కల సంతతిని నియంత్రించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలి. ఇటీవల కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. రోడ్డు వెంబడి వెళుతుంటే మోటారు బైక్‌లు, కార్ల వెంబడి పడి తరుముతున్నాయి. పాదచారులపై కూడా దాడి చేస్తున్నాయి. డంపింగ్ యార్డుల సమీపంలో రోడ్డు మీదుగా వెళ్లాలంటే భయమేస్తోంది.

– కె.వీరబాబు, కడియపులంక

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



నక్కా రాంబాబు

కోరుకొండ: పొగాకు రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గుమ్ములూరు సర్పంచ్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నక్కా రాంబాబు అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. పొగాకు ధర రెడ్ సాయిల్ రకం రూ.290కు, బ్లాక్ సాయిల్ రకం రూ.230కు తగ్గిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రెడ్ సాయిల్ కేజీ పొగాకు రూ.410, బ్లాక్ సాయిల్ రూ.360 ఉందన్నారు. పొగాకు సాగుకు ఎకరానికి సుమారు రూ.2.50 లక్షలు పెట్టుబడి అవుతోందన్నారు. కూటమి పాలనతో ధర పతనమవుతుండటంతో రైతులు నష్టాల భారిన పడతారన్నారు. ప్రభుత్వం రైతు పక్షాన నిలబడి ధర పెంచి కొనుగోలు జరిపించాలని నక్కా రాంబాబు డిమాండ్ చేశారు. కోరుకొండ, సీతానగరం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల్లో బ్లాక్ సాయిల్ పొగాకు పండిస్తారన్నారు. ఈ సమస్యపై సంబంధిత పొగాకు బోర్డు అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 22న పొగాకుకు గిట్టుబాటు ధర ఇవ్వాలని ఆందోళన చేయనున్నట్టు తెలిపారు.

క్లుప్తంగా

కో ఆప్షన్ సభ్యుడిగా బాజ్జీ



షేక్ బాజ్జీకి ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి గిరి

కడియం: మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా కడియపుసావరం నుంచి షేక్ బాజ్జీ ఎంపికయ్యారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో బాజ్జీ ఒక్కరే కూటమి పార్టీల తరఫున నామినేషన్ దాఖలు చేశారు. దీంతో నిర్ణీత సమయం ముగిసిన తరువాత బాజ్జీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గిరి వెల్లడించారు. కాగా గతంలో కో ఆప్షన్ సభ్యుడిగా ఉన్న షేక్ వలీ శ్రీనివాస్ ఇటీవలే మృతి చెందారు. దీంతో ప్రస్తుతం ఈ ఎన్నిక నిర్వహించారు. కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన బాజ్జీని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఎంపీడీవో రమేష్, జనసేన, టీడీపీ నాయకులు అభినందించారు.

సమస్యలపై ఎనిమిది అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ కృష్ణనాయక్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీనీ పరిశీలించి, ఫిర్యాదుదారునికి పూర్తి స్థాయి న్యాయం చేయాలని డివిజన్ అధికారులకు ఆర్డీఓ ఆర్.కృష్ణ నాయక్ సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ప్రజలు ఎనిమిది అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యలపై కార్యాలయానికి రాకుండా 1100కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరి

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రభుత్వ సేవలు పొందేందుకుగానూ ప్రతి పౌరుడు హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ఆయన సోమవారం మాట్లాడుతూ కేవలం సంక్షేమ పథకాల కోసమే కాకుండా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ట్యాక్స్ పేమెంట్, ల్యాండ్ రిజిస్ట్రేషన్లు వంటి సేవలకు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. తెల్లరేషన్ కార్డుదారులతో పాటు ఇతర కార్డుదారులు, ఆర్థికంగా ఉన్నత వర్గాల వారు కూడా మ్యాపింగ్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ సేవలు పొందడటం ప్రతి పౌరుడి హక్కు అన్నారు. ముఖ్యంగా గేటెడ్ కమ్యూనిటీలో నివసించే ప్రజలు ముందుకు వచ్చి ప్రభుత్వ సేవల లబ్ధిని కోల్పోకుండా తమ పరిధిలోని సచివాలయాలను సంప్రదించాలన్నారు.

దివ్యాంగులకు రోటరీ క్లబ్ సహాయం



దివ్యాంగులకు సాయం అందించిన ఐకాన్స్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో అవసరార్థులను గుర్తించి, వారికి సహాయం అందించడంలో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఎల్లప్పుడూ ముందుంటుందని క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ తీగెల రాజా అన్నారు. అంధత్వంతో బాధపడుతున్న పది మంది యువకులకు ఆరునెలలకు సరిపడే బియ్యం, నిత్యావసరాలు, రైస్ కుక్కర్, భోజనం చేయడానికి అవసరమైన కంచాలు, గ్లాసులను సోమవారం క్లబ్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వెంకట్ ఇమ్మాణి, సెక్రటరీ సురేష్, ఉదయగిరి, ప్రెసిడెంట్ ఎలక్ట్ మండవల్లి వెంకన్న బాబు, సెక్రటరీ ఎలక్ట్ రఘునాథరాజు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం అద్భుత కళారూపం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఒక వ్యక్తి భావాలు, ఆలోచనలు, నమూనాలను వ్యక్తపరిచే అద్భుత కళారూపమే చిత్రలేఖనమని డ్రాయింగ్ ఆర్టిస్ట్ రవీంద్రకుమార్ అన్నారు. రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం ఆయన చిత్రలేఖనంలో మెళకువలు నేర్పించారు. ట్రస్ట్ సభ్యులు మతల రమేష్, ఆదిరెడ్డి శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

టీడీపీ మినీ మహానాడు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ప్రియాంక గార్డెన్స్‌లో టీడీపీ వైద్య విభాగ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ ఆధ్వర్యంలో సోమవారం మినీ మహానాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ అధ్యక్షత వహించారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు డొక్కా నాథ్ బాబు తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు గడువులోగా సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి అధికారులతో కలిసి ప్రజల నుంచి 27 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో స్వయంగా పర్యటించి, పారదర్శకంగా విచారణ జరిపి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా చూడాలన్నారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు జీరో స్థాయికి తీసుకురావాలని సూచించారు. సమర్పించిన అర్జీ పరిష్కారం కాలేదనే ఫిర్యాదు ఎక్కడా రాకూడదన్నారు.

ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు



వినియోగదారుడికి అవగాహన కల్పిస్తున్న శామ్యూల్ రాజు, అనంతరావు

రాజమహేంద్రవరం సిటీ: ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులను విక్రయిస్తే కేసు నమోదు చేస్తామని లీగల్ మెట్రాలజీ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు హెచ్చరించారు. లీగల్ మెట్రాలజీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. శామ్యూల్ రాజుతో పాటు జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్బం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శామ్యూల్ రాజు మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు తాను కొనుగోలు చేసిన వస్తువు ధర, తయారీ తేదీ, నాణ్యత తదితర వివరాలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్టీసీ డీఎం షేక్ షబ్బం మాట్లాడుతూ బస్టాండ్‌లో అధిక ధరలకు అమ్మకుండా వ్యాపారులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నామన్నారు. ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తున్నారన్నారు. డీసీపీసీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ వినియోగదారుడు మోసపోకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. అందులో భాగంగా ఎన్‌సీహెచ్ యాప్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉచితంగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. యాప్ లేదా 1915 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఎటువంటి ఫిర్యాదునైనా స్వీకరించి నిర్ణీత సమయంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆర్టీసీ, రైల్వే, ఎయిర్ పోర్ట్, సినిమా థియేటర్లలో కూడా అధిక ధరలకు అమ్మితే ఫిర్యాదు వేయాలన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లోని పలు దుకాణాలను తనిఖీ చేసి వ్యాపారస్తులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివ బాలాజీ, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు, స్టేషన్ మేనేజర్ ఏవీ రావు, వ్యాపారస్తులు, ఆర్టీసీ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

ప్రజలకు యోగాపై అవగాహన కల్పించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

- ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు ప్రణాళిక
- అధికారుల మధ్య సమన్వయం అవసరం
- కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, నగరపాలకసంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్.. జిల్లా, నియోజక వర్గ, మండల ప్రత్యేక అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ యోగా దినోత్సవంలో అన్ని వర్గాల ప్రజలను స్వచ్ఛందంగా భాగస్వాములను చేయాలన్నారు. దానికి అనుగుణంగా ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఆ నెల రోజుల పాటు ప్రతి ఒక్కరూ యోగాను అనుసరించేలా రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర పేరిట ఒక ప్రచార కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. దానిలో భాగంగా ఈ నెల 21 నుంచి 27 వరకూ ప్రాథమిక దశ కింద ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ శిక్షణ, 28 నుంచి జూన్ 3 వరకూ మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ, జూన్ 4 నుంచి 16 వరకు గ్రామ,వార్డు స్థాయిల్లో శిక్షణ తరగతులు నిర్వహించాలని తెలిపారు. భూ సంబంధిత అంశాల తో పాటు ఇతర సమస్యలను గుర్తించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు అందజేస్తున్న పౌర సేవలు, అర్జీల పరిష్కారంలో అధికారుల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నామన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు మరింత నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు.

అన్నయ్య మందలించాడని వివాహిత అదృశ్యం



పిల్లలతో షర్మిల (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: అన్నయ్య మందలించాడని ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. పోలీసుల కథనం ప్రకారం.. గోరక్షపేటకు చెందిన 28 ఏళ్ల షేక్ షర్మిల, ఆమె ఇద్దరు పిల్లలు తొమ్మిదేళ్ల షేక్ హయాన్, ఐదేళ్ల షేక్ హనీషాతో కలిసి వేసవి సెలవులు కావడంతో హుకుంపేట సావిత్రి నగర్‌లో అమ్మగారింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో షర్మిల ఆదివారం తన సోదరుడితో గొడవపడింది. దీంతో సోమవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో తన పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. ఈ మేరకు షర్మిల భర్త అజీముద్దీన్ షరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బొమ్మూరు ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయవాడలో 5న ఉద్యోగుల కౌన్సిల్



రాజానగరంలో పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉద్యోగులు



కాపవరం వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద..

రాజానగరం: విజయవాడలో జూన్ 5న నిర్వహించనున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర తృతీయ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్ పాల్, రాజమహేంద్రవరం రూరల్ యూనిట్ అధ్యక్షుడు ఎస్‌వీఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై కౌన్సిల్‌లో చర్చిస్తామన్నారు. ఈ మహాసభకు సీఎం, డిప్యూటీ సీఎంలను కూడా ఆహ్వానిస్తున్నారన్నారు. మహాసభకు సంబంధించిన పోస్టర్‌ని విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ జె.రాజారావు, యూనిట్ అసోసియేట్ అధ్యక్షుడు టి.శ్రీధర్, ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య, ఎం.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కోరుకొండ: విజయవాడలో జూన్ 5వ తేదీన నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) కౌన్సిల్ పోస్టర్‌ను కోరుకొండ శాఖ సోమవారం ఆవిష్కరించింది. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు కాపవరంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు సమాచారం అందించాలని, పోస్టర్లు అతికించాలని సమావేశం తీర్మానించింది. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి దినేష్, కోరుకొండ శాఖ అధ్యక్షుడు బీకే మల్లికార్జునరావు, కార్యదర్శి డి.భగవాన్ దాస్ పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రాప్తిరస్తు

- గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలు
- ఉత్సాహంగా తరలివస్తున్న విద్యార్థులు
- జూన్ 6 వరకూ శిక్షణ తరగతులు



రంగంపేట గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

రంగంపేట: గ్రంథాలయాలు విద్యార్థులను రమ్మని పిలుస్తున్నాయి. ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. సెలవులను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీసేందుకు ఈ శిబిరాలు దోహదపడుతున్నాయి. పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించేందుకు స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏప్రిల్ 28న ప్రారంభమైన శిబిరం జూన్ 6 వరకు కొనసాగనుంది. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. విజ్ఞానం, వినోదం, సాహిత్యం, చిత్రలేఖనం, సంగీతం, నత్యం, ఆంగ్ల భాష, భావవ్యక్తీకరణ తదితర అంశాలలో పట్టు సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. పిల్లలకు ఆసక్తి కలిగించే పలు పుస్తకాలు అందుబాటులో ఉంచారు. బాల సాహిత్యం, దేశ నాయకుల జీవిత చరిత్రలు, దేశభక్తి పెంపొందించే పుస్తకాలు చదవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

ప్రత్యేక తరగతులు




ఈ వేసవి శిక్షణ శిబిరానికి నిపుణులు, ఉపాధ్యాయులు, యువకులు వచ్చి ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగిస్తున్నారు. అలాగే కొత్త విషయాలను పిల్లలకు నేర్పిస్తున్నాం. చదువుకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల భవిష్యత్తులో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నాం.

– ఎస్.రామకోటేశ్వరరావు, గ్రంథాలయాధికారి, రంగంపేట

ఆకట్టుకునేలా..

శిబిరానికి రాగానే నచ్చిన పుస్తకాన్ని చదివిన తర్వాత మిగిలిన తరగతులు ప్రారంభిస్తున్నారు. స్టోరీ టెల్లింగ్ (ఆకట్టుకునేలా కథలు చెప్పడం) నీతి కథలు, మానవీయ ప్రవర్తన, ఎదుట వ్యక్తిని ఆకట్టుకునేలా కథలు చెప్పడం తదితర అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, పాటలు పాడటం, నత్యం తదితర అంశాల్లో నిపుణులు, విశ్రాంత ఉపాధ్యాయులతో తరగతులు చెప్పిస్తున్నారు. శిబిరానికి హాజరైన విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు, అరటి పండ్లు అందిస్తున్నారు.


చిత్రలేఖనంపై ఆసక్తి



చిత్రలేఖనం ఆసక్తితో శిక్షణకు వెళుతున్నాను. వివిధ రకాల బొమ్మలు వేయడం నేర్చుకుంటున్నాను. పేపరుతో పలు రకాల ఆకృతులు తయారు చేస్తున్నారు. ఇంగ్లిషు, సైన్సు తదితర అంశాలపై వివరిస్తున్నారు. ఇవి భవిష్యత్తులో మాకు ఎంతో ఉపయోగపడతాయి.

– బి.దుర్గాప్రసాద్, పదో తరగతి, రంగంపేట


కథలంటే ఎంతో ఇష్టం



నాకు కథలంటే ఎంతో ఇష్టం. ఇక్కడ ఎంతో ఆసక్తి గల కథలు చెబుతున్నారు. అలాగే కాగితంతో బొమ్మలు తయారు చేయడం, చిత్రలేఖనం నేర్చుకుంటున్నాను. సులభంగా బొమ్మలు ఎలా గీయాలో శిక్షణ ఇస్తున్నారు. వాటి మెళకువలు తెలుసుకోవడం ఆనందంగా ఉంది.

– కె.సాయి వెంకటలక్ష్మి, 6వ తరగతి, రంగంపేట.

చాలా బాగున్నాయి



వేసవి శిక్షణ తరగతులు చాలా బాగున్నాయి. ఎన్నో కొత్త విషయాలను తెలుసుకుంటున్నాను. నా స్నేహితులతో కలిసి చిత్రలేఖనం, ఇంగ్లిషు నేర్చుకుంటున్నాను, వేసవి సెలవులను బాగా ఎంజాయ్ చేస్తున్నాను. పలు అంశాలల్లో బాగా పట్టు సాధిస్తున్నాం.

– ఎల్. వరలక్ష్మి, 6వ తరగతి, రంగంపేట

సినిమాలు



శ్యామల	:	శుభం
సూర్యమినీ	:	ఫైనల్ డెస్టినేషన్
సూర్యప్యాలెస్	:	మిషన్ ఇంపాజిబుల్
స్వామి	:	మిషన్ ఇంపాజిబుల్
శివజ్యోతి	:	హిట్–3
అనుశ్రీ	:	ఫైనల్ డెస్టినేషన్
రాజా	:	ఫైనల్ డెస్టినేషన్
ఊర్వశి	:	లవ్‌లీ
రంభ	:	23
మేనక	:	ఎలెవన్
అప్సర	:	సింగిల్
కుమారి	:	మిషన్ ఇంపాజిబుల్
అశోక	:	ఫైనల్ డెస్టినేషన్
నామవరం		
వీఎస్ మహల్	:	మిషన్ ఇంపాజిబుల్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	మిషన్ ఇంపాజిబుల్, సింగిల్
కడియం		
వెంకటసూర్య	:	ఫైనల్ డెస్టినేషన్